# ముగింపుకు ముందు

వరుసగా ఇది మూడో రోజు. టౌనంతా అంధకారంలో వుంది. అక్కడక్కడ మిగిలిన కాస్త వెలుతురు (జనరేటర్లో - గ్యాస్‌లైట్లో) మినహా ఎటు చూసినా చీకటే. ఈ పవర్ కట్‌లో నేను జీవించలేనంటూ, లలిత వాళ్ల పుట్టింటికి (హైద్రాబాద్) వెళ్లిపోయింది.



టౌన్‌కు చివర్న, ఒక మూలన ఉన్న ఇల్లు మాది. భయం గొలిపే వంటరితనం. అటూ ఇటూ విసిరేసినట్లుగా కొన్ని ఇళ్లున్నాయిగానీ, సరిహద్దుల్ని మూసేసుకున్న రాజ్యాల్లా వుంటాయి ఆ ఇళ్లు, ఇంటి బయట నిలబడితే, టౌనని, నేషనల్ హైవేని కలిపే ఇన్నర్ రింగు రోడ్డు, దానిపై అప్పుడప్పుడు శబ్దం చేస్తూ, వెలుతురు చిమ్ముకుంటూ, వాహనాలూ, రోడ్డు అంచునే ఉన్న కరెంట్ సబ్ స్టేషన్. బ్రహ్మాండమైన వెలుగులు చిమ్మే సబ్ స్టేషన్, రెండు గుడ్డిదీపాల వెలుగులో దిగాలుగా వుంది. నిన్న ఉదయం నుంచి సబ్ స్టేషన్ బయట కాపలా వున్న గార్డు (వాచ్‌మెన్)... అతనే నా కాలక్షేపం. పగలంతా మార్చింగ్ లాగా అటూ ఇటూ తిరుగుతాడు. గంటగంటకూ కాఫీ తాగుతాడు (అతని టేబుల్ పై అతి పెద్ద ప్లాస్కు వుంది). చాలాసేపు న్యూస్ పేపర్ చదువుతాడు. అతని చుట్టూ సిగరెట్టు పొగలు. రాత్రిపూట స్వెట్టర్, రగ్గు కప్పుకొని (అంతగా చలి లేకున్నా) పొడువాటి బల్లపై పడుకొని, వచ్చీరాని పాటలేవో పాడుతుంటాడు. ఈ నిర్మానుష్యంలో, ఖాళీ తనంలో అతన్ని గమనించటమే నాకున్న ఏకైక కాలక్షేపం.

ముప్పయి ఆరుగంటల తరువాత అతన్ని కలవాలని, అతనితో మాట కలపాలని నిర్ణయించుకొన్నాను. గేటు దగ్గరకు వేసి రోడ్డు వైపుకు నడిచాను. రోడ్డుపై ఎప్పటివో టైర్ల గుర్తులు అట్లాగే ఉన్నాయి. అతను నా వైపు అనుమానంగా చూశాడు. మాట కలుపుతున్నట్లుగా, ‘‘ఎన్నాళ్లుంటుందో స్ట్రయికు,’’ అన్నాను.

ఒంటిపైని రగ్గుని దగ్గరగా జరుపుకొని, ‘‘స్ట్రయికులు, గియి కులు, నాకు తెలియదు. కాపలా ఉండటమే నా ఉద్యోగం,’’ అన్నాడు ఆసక్తిలేని గొంతుతో. అతని పక్కనే గాజుగ్లాసు. అందులోని కాఫీ ఇంకా పొగలు గక్కుతుంది.

‘‘ఇవాళోరేపో, ఎన్నాళ్లు చేస్తారు,’’ అన్నాను నేను ఒక ప్రకటనలా.

ఆకాశం వైపు చూశాను. మబ్బులు చీలి, వెలుతురేదో నేలకు జారుతున్నట్లుగా వుంది. ‘‘ముగింపు దగ్గర కొచ్చింది,’’ అన్నాను

ఆకాశం వైపుకు చూస్తూ. అతన్ని దగ్గరగా చూశాను. ముఖంలో ఏ భావంలేదు. పెరిగిన గడ్డం, దువ్వని తల, గోడకు ఆనుకొని, అలసట నిండిన కళ్లతో నన్ను చూస్తున్నాడు. అతని పక్కనే ఉన్న విరిగిన స్టూలుపై కూర్చుని, "నీ పేరేమిటి?" అన్నాను.

అతను నా వైపు అనుమానంగా చూస్తూ, "సంతోషం," అన్నాడు.

"సంతోషం," నేను ఇష్టంగా, ఆసక్తిగా ఆ పేరును పలికాను. "సుందరం," అంటూ నా పేరు చెప్పి, షేక్‌హాండ్ కోసం చెయ్యి చాచాను. అతని చెయ్యి వెచ్చగా, బలంగా వుంది.

"ఎన్ని గంటలుంటుంది నీ డ్యూటీ."

"ఎన్ని గంటలేంది? రిలీవర్ వచ్చే వరకూ ఉండాల్సిందే. స్ట్రయికు కదా. ఒక నలుసు కూడా లేరిక్కడ. వదిలేసి వెళ్లడానికి లేదు. ఇరవై నాలుగు గంటలైంది నా డ్యూటీ మొదలై..."

సన్నటి రవ్వగాలి కాస్త చలిగా, ఉల్లాసంగా వుంది. నీలిరంగు తెరలా సమస్తాన్ని కప్పిన చీకటి. గేటు ముందున్న రెండు దీపాల వెలుగు గాఢమైన చీకటిలో పాలిపోయినట్లుగా వుంది. విరిగిన స్టూల్ పై నుంచి లేచి, ఎత్తైన అరుగులాంటి ప్రదేశంపై కూర్చున్నాను. రోడ్డు నిశ్శబ్దంగా వుంది. దూరంగా ఎక్కడో ప్రవహిస్తున్న నీళ్ల చప్పుడు. టౌన్‌లోంచి కొన్ని శబ్దాలు హఠాత్తుగా ఎగిరి వచ్చి, అంతలోనే సద్దు మణిగి... రాత్రి అయినా సరే, ఈ ప్రపంచం ఇంత నిశ్శబ్దంగా ఎలా వుండగలదనిపించింది.

"సిగరెట్టు కావాలా," అంటూ సిగరెట్టు పాకెట్ నాకు అందించాడు సంతోషం.

"అలవాటు లేదు, ఎప్పుడూ తాగలేదు," అన్నాను. "ఎన్నాళ్ల నుంచి చేస్తున్నావీ ఉద్యోగం?" అడిగాను.

"ఇదేం పర్మినెంటు కాదు. ఏ పనిబడితే అది," అని, "మరి నువ్వో," అన్నాడు నా వైపు చూస్తూ.

"నేనా, పెద్ద ఉద్యోగమేం కాదు, ప్రస్తుతం స్ట్రయికులో ఉన్నాము" అన్నాను, నొప్పి పెడుతున్న ఎడమ కాలిని గట్టిగా నొక్కు

కుంటూ. “ఇటురా, ఈ బల్లపై కూర్చో” అంటూ తన పక్క చోటును చూపాడు. లేచి, అతనివైపు నడిచాను. “కుంటుతున్నావే.” “అవును, యాక్సిడెంటు అయ్యింది. లోపల ఇనుపరాడ్లు, ప్లేట్లు వేశారు,” అన్నాను.

“కాఫీ,” అంటూ ఫ్లాస్కులోంచి కాఫీ పోసిచ్చాడు.

కాఫీ తాగుతూ, చుట్టుపక్కలకు చూశాను. శబ్దాలన్నీ క్రమంగా ఆగిపోయాయి. మా చుట్టూ గాఢమైన చీకటి. ఇప్పటిదాకా ఆకాశాన్ని కప్పిన మేఘం ఎటో వెళ్లిపోయింది. సన్నటి వెన్నెల వెలుగులో మేమిద్దరం బ్లాక్ అండ్ వైట్ ఫొటోల్లా మెరిసిపోతున్నాము. కొద్దిగా చలి. చీకట్లో అతని సిగరెట్టు ఎర్రటి నేత్రంలా వెలుగుతుంది.

“ఈ స్ట్రయికు సంగతేంటి?” అన్నాడు నా వైపు చూస్తూ. నేనేం మాట్లాడలేదు. కాసేపు ఆగి, అతనే, “బస్సులన్నీ ఆగిపోయాయి. ఆటోవాళ్లు యాభై, వందా అడుగుతున్నారు. మైళ్లు, మైళ్లు నడవాల్సి వస్తుంది.”

రెండు క్షణాల నిశ్శబ్దం తరువాత, “ఇంట్లో నాయన ఒక్కడే ఉంటాడు. మున్సిపాలిటీలో స్వీపర్‌గా పనిచేశాడు. రిటైరైనాడు. తాగి తాగి లివర్ చెడిపోయింది. నాలుగేళ్ల క్రితం కాలు చచ్చుడు వచ్చింది. అట్లాగే ఈడ్చుకుంటూ నడుస్తాడు. గోడలో, గుంజలో పట్టుకొని నడుస్తాడు. అట్లాగే ఈడ్చుకుంటూ, ఇద్దరికీ కాస్త వంట చేస్తాడు. డబ్బాలో పెట్టి ఇస్తాడు. నెలనెల బ్యాంకుదాకా వెళ్లి పెన్షన్ తెచ్చుకుంటాడు. రెండు నెలలుగా అదీ ఆగిపోయింది. ఈ స్ట్రయికు ఏందో ఆ మనిషికి తెలియదు. అట్లాగే ఈడ్చుకుంటూ, రోడ్డు ఆ చివర, ఈ చివర దాకా నడుస్తాడు. రోడ్డుపై కనబడ్డవాళ్లతో మాటలకు దిగుతాడు. కాస్త పుగాకు, ఆకు వక్కలు వుంటే, ఆ మనిషి బాగా కుశాల. అయ్యికూడా కొనలేని పరిస్థితి” స్వగతంలాగా అన్నాడు..

నేనేం బదులు చెప్పలేదు. చీకట్లో అతని మాటలే, పెద్దగా విని పిస్తున్నాయి, ప్రవక్తల మాటల్లాగా, అన్ని వైపుల నుంచి మార్మోగు

తున్నట్లు. కాస్త చలి మొదలైంది. చల్లటిగాలి, ఊపిరితిత్తుల్లోకి చొరబడి, లోపల సన్నని మంట పెడుతున్నట్లుగా వుంది. మేమిద్దరం, చాలాసేపు ఏం మాట్లాడుకోకుండా కూర్చున్నాము.

"ఏవైనా తింటావా?" అన్నాడు, పక్కనున్న వైరుబుట్ట వైపు చూస్తూ. "ఉడకబెట్టిన గుడ్లు, కాల్చిన ఎండుచేపలు, కాసిని చెనక్కాయలు ఉన్నాయి," అంటూ బుట్టలోంచి డబ్బాలు బయటకు తీశాడు. ఉడకబెట్టిన గుడ్లు, బిస్కెట్లు, ఎండు చేపలు చపాతీలు... "రా, తీసుకో," అన్నాడు. "తినే ముందు, ఒక దమ్ము కొట్టు. చలిలో బాగా సమ్మగా వుంటుంది," అంటూ సిగరెట్టు అందించాడు. సిగరెట్టు పొగ గొంతులోకి చేరి, అక్కడేదో గుచ్చుకున్నట్లనిపించి, దగ్గు తెర వచ్చింది. ఎండుచేపల్ని ఇష్టంగా తిన్నాను. "తిను, తిను, అన్నీ నీకే," అంటూ వాటిని నా వైపుకు జరిపాడు. "నువ్వెక్కడ ఉంటావు? ఒక్కడివేనా? ఫ్యామిలీ?" అంటూ నా వైపు చూశాడు.

"ఇక్కడ దగ్గరలో మా యిల్లు. నా భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. ఈ సమ్మెలాగే అర్థంకానిదేదో మా మధ్యన నలుగుతుంది," అన్నాను అసంకల్పితంగా. లోపల నలుగుతున్నదేదో బయటకు వచ్చినట్లనిపించి, క్షణం సేపు బిగుసుకుపోయాను.

"కుంటికాలి మనిషివి, ఇట్లా ఒక్కణ్ణి వదిలేసి వెళ్లిందా," అన్నాడు సానుభూతిగా. న్యూస్ పేపరు చించి, దాంట్లో చపాతీ, రొయ్యలకారం వేసి, నా ముందుకు తోశాడు.

హఠాత్తుగా దిగులు నన్ను చుట్టుముట్టింది. లోపల ఏదో గట్టు తెగినట్లుగా వుంది. దుఃఖమేదో బయటకు రావాలి. లోపల, దాచిన దాన్నంతా నాకు కొసరి కొసరి తినిపిస్తున్న ఈ మనిషి ముందు కక్కేయాలి.

"ఇంకోటి, ఇంకో చపాతీ తిను," అంటూ ఇంకో చపాతీని నా కాగితంలో వేశాడు. ఆ మనిషిని కాదనలేకపొయ్యాను. చపాతీని నములుతూ, ఒక్కసారిగా బరెస్టయ్యాను.

"నిన్న ఉదయం నుంచే వాతావరణంలో మార్పు వచ్చిందన్న విషయం నాకు అర్థమవుతుంది. ఇల్లు నిశ్శబ్దంగా వుంది. టి.వి. మోగటం లేదు. ఇంట్లో మనుషులెవరూ లేనట్లుగా. ఫ్రిజ్ ముందు, మోకాళ్లపై కూర్చుని, ఫ్రిజ్‌లో పేర్చిన సీసాలన్నీ బయటకు లాగుతుంది. (అమ్మ చేసిపెట్టిన పచ్చళ్లు, కాకరకాయ వేపుడు, చింత తొక్కు మూడు రోజులనాటి గోధుమ హల్వా, ఉలవచారు) సీసాలమూతలు తీసి, గట్టిగా వాసన చూసి, 'హు' అంటూ నిట్టూర్చి, వాటన్నిటిని పాడైపోయాయని (కరెంటు పోవటం, ఫ్రిజ్ పని చెయ్యకపోవటం ఒక నెపం మాత్రమే).

ఇంత నిశ్శబ్దంగా, (ఎప్పుడూ పెద్దగా అరుచుకోము) ఇంత 'పొలైట్'గా, ఒకళ్లపై ఒకళ్లం ఎట్లా అయిష్టాన్ని పెంచుకున్నామో, నాకు అంతుపట్టదు. ప్రతివారం ఇదే తంతు. ఆదివారం అమ్మ దగ్గరకు వెళ్లి వస్తాము (పక్కనే ఉన్న పల్లెటూరు). వారానికి సరిపడా కూరలు, పచ్చళ్లు చేసి, సీసాల్లో, బాక్సులో పెట్టి (వంట సరిగ్గా చేయటం రాదు ఈ సిటీ పిల్లకు) పంపిస్తుంది. సోమ, మంగళవారాల్లో వాటన్నిటిని తీసి, డస్ట్‌బిన్‌లోకి విసిరేస్తుంది లలిత (వాసన వేస్తున్నాయనో, బూజు పట్టాయనో).

నిన్న ముఖ్యమైన రోజు. ఇంటిలోంచి వెళ్లిపోడానికి నిర్ణయించుకుంది. కరెంటు లేకపోవటం, తాత్కాలిక కారణం. ఆ నెపంతో ఇంటి మొత్తాన్ని రెండు భాగాలు చేసింది. అటకపైనున్న నా చిన్నప్పటి జ్ఞాపకాల్ని (గోలీలు, ఫుట్ బాల్, వందలాది స్టాంపులు, నా చిన్నప్పటి ప్రైజులు) కిందకు లాగి, (అందులోంచి తన వస్తువులు మాత్రం తీసికొని) దూరంగా విసిరేసింది. ఆమె బట్టలన్నీ (చానాళ్లుగా వాడనివి కూడా) పెళ్లిచీర, బంగారపు సరుకుతో సహా అన్నీ సర్దుకుంది. ఇంట్లో రెండు విడివిడి గుట్టలు తయారయినాయి, ఆస్తి పంపకాల్లా. ఇది తాత్కాలిక ప్రయాణంలా కనబడలేదు. రెండు సూట్‌కేసుల నిండా సర్దింది తన వస్తువులన్నీ.

అసలు గొడవంతా ఉదయాన ఫ్రిజ్ తీయడంతో మొదలైంది. కరెంట్ లేక, లోపల పదార్థాలన్నీ కుళ్లిపోయి, తలుపు తీయగానే, భరించలేని వాసన. అమ్మ ఎంతో ఇష్టంగా చేసిన చేపల పులుసు, పులిహోర గిన్నెలు తీసి నేలపైకి విసిరేసింది. మొన్న ఆదివారం, అమ్మ దగ్గరకు వెళ్లినప్పుడు, మా కోసమని 'చందువాలు' తెప్పించి, చేపల పులుసు చేసింది. చింతపండు పులిహోర కూడా చేసింది. పెరట్లో పూసిన మల్లెలు (తనే) దండగా కట్టి ఆకులో చుట్టి, లలితకు ఇచ్చింది. సోమవారం ఉదయం, మల్లెల దండలు డస్ట్‌బిన్‌లో ప్రత్యక్షం అయ్యాయి. చేపల పులుసు, పులిహోర నేలపై దొర్లుతున్నాయి. ఫ్రిజ్ ముందు కూర్చుని, ఒక్కో సీసానీ బయటకు లాగుతూ, హైదరాబాద్ వెళ్లిపోవడానికి నిర్ణయాన్ని ప్రకటించింది. ఇంట్లో టైమ్ బాంబ్ సెట్ అయ్యింది.

లోపల ఆ తతంగం జరుగుతుంటే, బయట వరండాలో కూర్చుని, కాలాన్ని అటూ ఇటూ తిప్పుతూ ఎప్పుడు, ఎక్కడ, ఎలా, అంటూ తాత్వికమైన ప్రశ్నలు వేసుకుంటూ కూర్చున్నాను నేను, కనబడని గోడ మా మధ్య ఎప్పుడు మొలిచిందో లెక్కలు వేసు కుంటూ...

ఇష్టంగా మాట్లాడుకున్న సందర్భం ఎప్పుడు? రాత్రి పది వరకూ మేలుకొని, కలిసి సీరియళ్లు చూసిన రోజులు. సెకండ్ షో సినిమాలు, ఆఫీసులో లేటయి, కారులోనే నిద్రపోతే, భుజాలపై ఎత్తుకొని బెడ్ పై పడుకోబెట్టి, నిద్రలోనే తనకు రెండు ముద్దలు తినిపించి...

ఇద్దరి మధ్య ఎడం ఎప్పుడు వచ్చిందో గుర్తురావటం లేదు. ఇద్దరి మధ్యనున్న ఆ మాజిక్, ప్రేమ, స్నేహం, సాన్నిహిత్యం ఎప్పుడు మాయమయ్యాయో గుర్తురావటం లేదు. ఆమె ఫోన్ కోసం (ఆమె గొంతు వినాలని) గంటల తరబడి ఎదురుచూసిన క్షణాలు. భుజంపై వాలిపోయి, వాకింగ్‌లు చేసిన రోజులు. ఒకళ్లకొకళ్లు హత్తుకొని, అట్లా గంటల తరబడి కూర్చున్న రోజులేవి? ఇద్దరూ కలిసి ఒక ప్రేమ

నగరాన్ని నిర్మించుకుని, వందేళ్ల జీవితాన్ని ముందే రాసుకుని, యుగళగీతాలు, కలిసి కన్న కలలు అదృశ్యం ఎట్లా అయ్యాయి?

ఎనిమిది గంటల దాక ఫ్రిజ్ ముందే కూర్చుంది తను. లావాటి ఆవకాయజాడీని బయటకు లాగింది. డస్ట్‌బిన్‌లో వేసింది. నేను మౌనంగా చూస్తున్నాను. దేశాల మధ్యన కోల్డ్ వార్ అంటారే, అట్లాంటిదే ఇక్కడ సాగుతుంది.

ఫ్రిజ్ ముందు నుంచి లేచింది, రెండు చేతులు నడుంపై పెట్టుకొని. సంధి సూచనలా సన్నగా నవ్వాను నేను. తన ముఖం బిగుసుకొని ఉంది. పెదాలు మందబారినట్లుగా, ముఖంపైని కండరాలు చెక్కముక్కలుగా మారి... (ఇంద్రధనస్సు లాంటి ఆమె చిరునవ్వు ఎక్కడ?)

"I need a breek," అంది. ''కాస్త fresh air కావాలి,'' అంది.

లేచి, తన దగ్గరకు వెళ్లి భుజాల చుట్టూ చెయ్యివేసి... నిర్జీవంగా చూసింది నావైపు.

సరిగ్గా సంవత్సరం క్రితం హార్ట్ ఎటాక్ వచ్చింది నాకు. ఇద్దరం సినిమాహాల్లో ఉన్నాం. హఠాత్తుగా చెమట్లు. ఎడమచెయ్యి చాతీలో గుంజినట్టుగా నొప్పి... లలితకు అర్థమైంది.

ఐదు నిముషాల్లో అన్నీ ఎరేంజ్ చేసింది. అంబులెన్స్... హస్పటల్లో చేరడం...

''అదృష్టవంతుడివి. ఆవిడ టైమ్కి రియాక్ట్ అయ్యింది,'' అన్నాడు డాక్టరు. పెద్దగా ఏడుపు వచ్చింది. చప్పుడు చెయ్యకుండా పొగిలి పొగిలి ఏడ్చాను. ''యూ ఆర్ సేఫ్,'' డాక్టరు ఓదార్చు తున్నాడు గానీ, గదిలో లలితలేదు. ఒక మూలన అమ్మ కళ్లు వత్తుకుంటూ...

లలిత నా పక్కన ఉండాలని, ప్రాణం పోకుండా నన్ను గట్టిగా పెనవేసుకోవాలని, నా చుట్టూ రక్షణకవచంలా, తను నిలబడాలని, హాస్పటల్లో ఉన్నంత కాలం ఆమె నిర్లిప్తంగాఒక విజిటర్‌లాగే ఉండి పోయింది. ఎందుకు ఎందుకు అని చాలాసార్లు గొణుక్కున్నాను.

ఫ్రిజ్ ఉన్న గదిలోంచి, మూడు సంచుల జంక్‌ని లాక్కు వస్తుంది లలిత. ముఖంపై చెమట్లు తుడుచుకుంటూ, జారిపోయిన పైట.

వెళ్లి ఆమెను గట్టిగా కౌగిలించుకొని, అట్లాగే బెడ్రూమ్‌లోకి తీసుకెళ్లి... ఆమె ఆశ్చర్యంలో... బహుశా కోల్డ్ వార్ ముగిసేదేమో?

భయంవేసింది. అట్లా చెయ్యలేకపొయ్యాను. పెద్దగా అరిచి అసహనంగా చూసి, 'రేపిస్టువి నువ్వు,' అని తిట్టి... ఆ దృశ్యాన్ని ఊహించుకుని ఆగిపోయాను. .

మరోసారి ఆమె వైపు చూసి నవ్వాను. ఆమె ముఖంలో కదలిక లేదు. గది మధ్యలో నా నవ్వు అట్లాగే, చలికాలంలోని ఇంధనుస్సులా వేలాడుతుంది.

సూట్‌కేసులు సర్దుతుంది లలిత... నేను డైనింగ్ టేబుల్ పై కూర్చుని ప్లేట్‌లో కాస్త పులిహోర వేసుకొని, ఒక మనోహరమైన, లలిత జ్ఞాపకాన్ని నా ఎదురుగా కూర్చుని, 'ఇంకో రెండు ముద్దలు తిను,' అంటూ కొసరి వడ్డించే రోజులు.

గ్లాసునిండా పాలు తెచ్చుకొని, నా ఎదురుగా కూర్చుంది లలిత.

హఠాత్తుగా "we are a family," అన్నాను వణుకుతున్న గొంతుతో.

"నువ్వు చెప్పే familyలో ఊపిరాడటంలేదు. I am choking," అంది. సగం తాగిన పాలగ్లాసునట్లాగే టేబుల్ పై పెట్టి పెద్దగా ఏడవటం మొదలుపెట్టింది టేబుల్ పై తల పెట్టుకొని. వెక్కి వెక్కి ఇల్లంతటినీ కుదిపివేసేలా, ఏడ్చింది.

ఒక ప్రవాహంలా, లోపలిదంతా బయటకు తెచ్చాను.

సంతోషం ఏం మాట్లాడలేదు. ప్లాసిక్ బుట్టలోంచి రెండు వేరుసెనగ ఉండలు తీసి నా చేతిలో పెట్టాడు.

"బాధగా ఉందా!" అన్నాడు హఠాత్తుగా. నేనేం మాట్లాడలేదు. నా మోకాలుపై చెయ్యివేసి, "దీన్ని గురించే... లోపల ఇనుము పెట్టా

రన్నావుగా'' అన్నాడు. ''నాకో ఆడమనిషి తెలుసు. మా బంధువుల పిల్లే, నాతో ఇష్టంగా ఉండేది. బిల్డింగ్ కట్టుబడి పనులకు పోయ్యేది. ఒకసారి, పై నుంచి జారిపడింది. కాళ్లలో ఇనుము పెట్టారు. చెక్క బొమ్మలా పట్టీపట్టీ అడుగులు వేసేది. ఆ పిల్లని పెళ్లిచేసుకోమని, అడుగుదామనుకున్నాను. ఇటుక బొచ్చెలు మోస్తూ, రెండోసారి రెయిలింగ్ పైనుంచి జారిపడింది. లోపలున్న ఎముకలు, ఇనుమూ విరిగిపోయి, చేతుల్తో ఎత్తుకొని వెళ్లాను ఆ మడిసిని అతికిచ్చడానికి లోపలేమీ లేవన్నారు. అట్లా చేతుల్తో ఎత్తుకొని మట్టి చేశాను,'' అన్నాడు సంతోషం. కళ్లలో నీళ్లు.

''నీకు పెళ్లయిందా?'' అన్నాను. అతని వైపు దీక్షగా చూశాను. ఏం మాట్లాడలేదు.

''కాఫీ తాగు చల్లారిపోతుంది'' అన్నాడు.

''పెళ్లి సంగతి చెప్పలేదు'' అన్నాను.

చాలాసేపు ఆలోచించి ''ఆ మనిషి ఇంకా గుర్తొస్తుంటుం దయ్యా,'' అన్నాడు అదే సమాధానం అన్నట్లుగా.

చల్లటిగాలి తెరలు తెరలుగా వీస్తుంది. పై నుంచి వెన్నెల పాలలా వెలుతుర్ని గాఢమైన చీకటిలోకి ధారగా పోస్తుంది. స్టేషన్ ముందు అప్పటిదాకా వెలిగిన రెండు లైట్లూ ఆరిపోయాయి. పైన కరెంటు తీగలు, లావాటి తాళ్లలా వేలాడుతున్నాయి.

''ఆ కరెంటు తీగల్ని ముట్టుకుంటే...'' అని ''ఒక్కక్షణం వాటిని పట్టుకుంటే ఏమవుతుంది'' అన్నాను. సంతోషానికి అర్థం కాలేదు.

''అసలు పట్టుకోవటం ఎందుకు,'' అన్నాడు.

''ఊరికే, ఒక ఆలోచన,'' అన్నాను.

''ఎవడో ఈడ్చికొట్టినట్లు రక్తంలోకి చావును పంపినట్లుగా,'' అన్నాడు సంతోషం. ''ఇంకా,'' అన్నాను. ''కళ్లకేమీ కనబడదు. లోపల్నించి ప్రాణాన్ని తోడివేస్తునట్లుగా ఉంటుంది,'' అన్నాడు.

"అదే, ఆ క్షణమే, ఒకే కాలంలో మనం ఉన్నట్లు, లేనట్లు, లేదా ఉండడానికి పోడానికి మధ్యన వేలాడుతూ," అన్నాను. సంతోషం నావైపు వింతగా చూశాడు.

ఎందుకీ చర్చను పొడిగిస్తున్నానో అర్థంకాలేదు. ఎవరివో ఆలోచనల్ని, మాటల్ని, పదాల్ని నేను పలుకుతున్నట్లు సంతోషం నా వైపే చూస్తున్నాడు, నేనేమైనా, చెప్తానని. ఇద్దరం చాలాసేపు మౌనంగా ఉన్నాము.

అంత చీకట్లోనే ఎక్కడో పక్షులు మేలుకొని అరిచి, మళ్లీ మౌనంగా అయిపోయాయి. మళ్లీ నేనో జ్ఞాపకంలా మారిపొయ్యాను. సంతోషం వింటున్నాడా లేదా అని పట్టించుకోకుండా మాట్లాడటం మొదలుపెట్టాను.

"నిన్నటికి, యాభై ఎనిమిదవ రోజు సమ్మె మొదలై. పనిలేదు. జీతం లేదు. ఖాళీగా పేపర్లు చదువుతూ, టీవీ చూస్తూ (ఇవాళ అదీ లేదు). లలిత వెళ్లిపోయిన తాలూకు దిగుల్ని జయించాలని రోడ్డు పైకి వచ్చాను. ఒక్కొక్క వీధి దాటుతూ, తెలియని కొత్త వీధుల వైపు నడిచాను. చాలా ఏళ్లుగా తెలిసిన టౌనేగాని, ఇవాళ రోడ్లన్నీ కొత్తగా ఉన్నాయి. హఠాత్తుగా ఒక రోడ్డు, డెడ్ - ఎండ్ కొస్తుంది. మళ్లీ వెనక్కు నడిచి... మరో కొత్త రోడ్డు ఎదురయ్యేది. మనుషులు నిమిత్త మాత్రంగా, రోడ్డుపక్కన నిలబెట్టిన బొమ్మల్లా ఉన్నారు. గాలిలో కాస్త చలి. పడమటి ఆకాశం చేమంతుల బుట్టలా ఉంది. వసంతకాలపు తొలిరోజులు గుర్తుకొస్తున్నాయి. రెండు మూడు గంటలు నడిచాక, చీకటి పడ్డాక, ఓపిక తగ్గి వెనక్కు వెళ్లాలని నిర్ణయించుకొన్నాను. దారి తప్పాను. అంతా జిగ్‌జాగ్ పజిల్‌లా ఉంది. రోడ్డుకు అటూ ఇటూ భవనాలు, ఇళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. మనుషులు కనిపిస్తున్నారు గానీ, వాళ్లు ఫ్రీజ్ చెయ్యబడ్డ దృశ్యంలోని మనుషుల్లా ఉన్నారు.

"నేను నడుస్తూనే ఉన్నాను. నాలుగైదు రోడ్లు కలిసే ప్రదేశానికి వచ్చాను. అంతా కొత్త ప్రదేశం. ఎటు వెళ్లాలో తెలియడం లేదు.

మనుషులెవరూ కనబడటంలేదు. ఇళ్లన్నీ తలుపులు వేసి ఉన్నాయి. నడిచి, నడిచి ఊరి చివరకు కాబోలు వచ్చాను. శిథిలమైన భవనాలు దుమ్ముపట్టి గోడలు కూలిపోయి... విరిగిపోయిన యంత్రాలు రోడ్డు పక్కన కుప్పలు బోసి... ఇనుప గుట్టల మధ్యన ఒక ముసలివాడు, ముసిల్ది కనబడ్డారు. అమ్మయ్య అనుకొని, 'శంకర్ విలాస్ సెంటర్ పోవాలి,' అన్నాను. వాళ్లు మాట్లాడలేదు. నేను కాస్త ముందుకు నడిచాక, 'స్ట్రయిక్ అయిపోయినట్లేనా?' అని అరిచింది ముసలమ్మ. నేను గాఢంగా నిట్టూర్చి, మరికాస్త ముందుకు నడిచాను. ఎత్తయిన సరివి చెట్లు కనబడ్డాయి. రోడ్డు పక్కన ఆగిపోయిన సిటీ బస్సు. ఇంకా ముందుకు నడుస్తుంటే టేకు చెట్ల వనాలు కనిపించాయి. పొడవాటి చెట్లు, గుబురు ఆకులు. రోడ్డుపై ఒక యారో మార్కు కనబడింది. అటు వైపుకు నడిచాను. కచ్చారోడ్డు. చాలామంది నడిచి వెళ్లినట్లుగా రోడ్డంతా కాలిగుర్తులు. కాస్త లోపలికి నడిచేనో, లేదో తట్టుకోలేని ఆనందంతో దిమ్మెరపోయాను. వందల ఎకరాల పూలతోటలు. గులాబీలు, చేమంతులతో నేలనంతా పూలతో అలంకరించినట్లు. మరికాస్త దూరం నడిచాను.

"అన్నివైపులా పూలతోటలే. కొత్త రకం పూలు, థాలియాలు, నీలిరంగు కార్నేషియన్ పూలు. ఆ పూలతోటల చుట్టూ ఇనుప కంచెలున్నాయి. (వాటిపై పుర్రెబొమ్మ 'X' గుర్తూ). 'కరెంటు ప్రవహిస్తుంది, జాగ్రత్త,' అంటూ సైనుబోర్డు. మైమరచిపోయే అందం, ఆ పూలతోట లది. ఆ ప్రదేశమంతా రంగురంగుల పూలసముద్రంలా వుంది. ఆ సముద్రంలో ఈదులాడాలని, ఆ పూలను గుండెలకు హత్తుకోవాలని, ఇనుప కంచె దాటి, లోపలికి అడుగుపెట్టాను, పూల సౌందర్యాన్ని చేతులతో తడుముతూ. 'చస్తావు రోయ్, లోపల బాంబులు పెట్టారు,' అంటూ ఎవరో అరిచారు. వెనక్కు తిరిగి చూశాను. దగ్గరలో ఎవరూ కనబడలేదు. వెనక్కు ఒక్కొక్కటే అడుగులు వేసుకుంటూ... అంత అందమైన తోటలు, దానికి కరెంటు వైర్లు, బాంబుల కాపలా... అది దేనికి సంకేతమో నాకిప్పటికీ అంతు పట్టలేదు," అన్నాను.

సంతోషం కళ్లు మూసుకొని, యోగనిద్రలో ఉన్నట్లుగా నేను చెప్పేది వింటున్నాడు. ఏదో చెప్పబోయి, ఆగిపోయాడు.

నేను నిశ్శబ్దంగా కూర్చున్నాను. రోడ్డు అంచునే ఉన్న చింతచెట్టు వైపు చూస్తున్నాను. నా లోపల ఏదో రసాయనిక చర్య జరుగుతూ వుంది. కండరాలన్నీ బిగుసుకుపోయాయి. ఎముకల్లో నొప్పి, లోపల శరీరమంతా గాయపడ్డట్టుగా. గాయం ఎక్కడుందో తెలియటంలేదు. నొప్పి, శరీర హింస మాత్రం తెలుస్తున్నాయి. ఆ మాటే సంతోషంతో అన్నాను.

సంతోషం సన్నగా, కొంటెగా నవ్వాడు. చేతిలోని సిగరెట్టును దూరంగా విసిరేసి ఫాంటు జేబులోంచి ఒక ప్లాస్టిక్ కవరు బయటకు తీశాడు. నాలుగైదు పొరల్లో చుట్టిన కాగితం పాకెట్ బయటకు తీశాడు. ఆ పాకెట్ నా చొక్కా జేబులో పెట్టి, "ఇది తీసుకో," అన్నాడు. "అన్నీ మర్చిపోతావు. దిగులు, బాధ, వాతావరణం బాగాలేకపోవటం, మనసు బాగాలేకపోవటం, అన్నీ మాయమవుతాయి. సమ్మగా, మబ్బుల్లో ఉన్నట్టు ఉంటుంది," అన్నాడు.

అతని గొంతులో కొంటెతనం తెలుస్తుంది. పాకెట్ తీసి వాసన చూశాను. గంజాయి వాసన.

కుక్కపిల్ల ఒకటి రోడ్డుకు అటు పక్కన తచ్చాడుతుంది. కుయ్యి, కుయ్యిమని అరుస్తుంది.

"అదిగో నా లవర్... ఇవాళ కూడా వచ్చింది. దానికి ఎండు చేపలంటే బలే యిష్టం. రోజూ ఈ టైముకే వస్తుంది," అన్నాడు సంతోషం ఉత్సాహంగా. "దా, దా ఇజూ," అని పిలుస్తూ దానివైపు నడిచాడు. అది సంతోషం చేతుల్లోకి దూకింది. దాన్ని గట్టిగా, గుండెలకు హత్తుకొని... నిజం ప్రేయసీ ప్రియుల్లా మురిసిపోతున్నారు.

నేను మెల్లగా అక్కడి నుంచి బయలుదేరాను. సంతోషానికి నన్ను పట్టించుకునే మూడ్ లేదు. ఇంటివైపుకు నడిచాను. కాలునొప్పి ఎక్కువైంది బరువైన అడుగులతో... సంతోషం కేరింతలు, కుక్కపిల్ల అరుపులు క్రమంగా దూరమైనాయి.

- ఇంటి బయట వెలిగించిన కిరోసిన్ లాంతరు ఆరిపోయింది. ఇల్లంతా చీకటి. కడుపులో ఆకలిలాంటి ఏదో నొప్పి. వంటగది వాసనగా ఉంది. కడగని పాత్రలు అట్లాగే ఉన్నాయి. ఫ్రిజ్ తెరిచి, టార్చిలైటు వేశాను. బ్రెడ్, జామ్, పాలు అన్నీ చెమటలో తడిసినట్లుగా కుళ్లిపోయి, వాసన వేస్తూ... లలిత తీసివేయగా మిగిలిన పదార్థాలివి. ఫ్రిజ్‌లోని పదార్థాలన్నీ బయటకు లాగాను... పాలు, పెరుగు, టొమేటో సాస్, జామ్, బ్రెడ్... ముక్కిపోయిన వాసన ఫ్రిజ్ నిండా. అన్నింటినీ బయటకు లాగి, ఒక ప్లాస్టిక్ సంచిలో వేసి, డీప్ ఫ్రీజ్‌లో లలిత ఇష్టంగా తినే అపోలో చేపలు ఉన్నాయి... అవీ వాసన వేస్తున్నాయి. వాటినీ బయటకులాగి, ప్లాసిక్ సంచిలో వేశాను.

ఇంటి వెనుక రెండు పొడవాటి కొబ్బరిచెట్లు ఉన్నాయి. కొబ్బరి చెట్ల పక్కన కూలబడి, రెండు చేతులతో మట్టిని తవ్వుతూ, గొయ్యిని చేశాను. చాలాసేపు మట్టిని బయటికి తీస్తూ, ప్లాస్టిక్ సంచి పట్టేంత గొయ్యిని చేశాను. ప్లాస్టిక్ సంచిని అందులోవేసి, మట్టిపోసి, ఆ ప్రదేశాన్ని చదును చేసి, ఒక ఆత్మీయుని మరణాన్ని కప్పిపెడుతున్నట్లుగా, జాగ్రత్తగా, భద్రంగా, ఇష్టంగా...

అక్కడే కొబ్బరిచెట్టుకు ఆనుకుని కూర్చున్నాను చాలాసేపు. వెన్నెల్లో తడిచిన కొబ్బరిచెట్ల ఆకులు సన్నని పాటలు పాడుతున్నాయి. దూరంగా సంతోషం తాలుకు కదలికలు వినిపిస్తున్నాయి. కొబ్బరి ఆకుల గలగలతోపాటు, గాఢమైన నిశ్శబ్దం కూడా తెలుస్తుంది. లలిత గుర్తుకొచ్చింది. ఏదో ఖాళీతనం. నా చుట్టూ ఉన్న ప్రపంచం మెల్లగా కుంచించుకుపోయి, చేతులు సైతం విప్పుకోలేనంత చిన్న ప్రదేశంలో, నేను బందీ అయినట్లుగా...

చేతుల్ని విదిలించుకొని, గట్టిగా శ్వాస తీసుకొని, ఒక్కసారిగా, పెద్దగా నవ్వాలనిపించింది.

*చినుకు మాసపత్రిక*
*డిసెంబర్ 2013*